నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, శనివారం 21 జూన్ 2025 | VIKARABAD



వేతనాల విషయంలో తమకు అన్యాయం జరుగుతుందంటూ నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికులు శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు. – ఖైరతాబాద్

## పాఠాలు చెప్పే సమయమేదీ?

సిటీబ్యూరో, జూన్ 20 (నమస్తే తెలంగాణ) : ప్రధానోపాధ్యాయులపై అదనపు భారం మోపడంతో వారు తమ విధులను సక్రమంగా నిర్వర్తించలేకపోతున్నారు. హైదరాబాద్ జిల్లాలో చాలామంది ప్రధానోపాధ్యాయులు ఇన్‌చార్జ్ డిప్యూటీ ఈవోలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అంతేకాదు ఒక హెచ్ఎం ఒక మండలంలో డిప్యూటీ ఈవోగా ఉంటూనే మరో పోస్టు డీఐవోఎస్‌గానూ బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తున్నది. ఈ అదనపు భారంలో భాగంగా వారు తమ మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లను పరిశీలించాల్సి ఉంటుంది. సిలబస్, టీచర్ల పనితీరు, ఫీజులు వసూళ్లు తదితరపై రిపోర్టు రెడీ చేసి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు అందించాల్సి ఉంటుంది. ఈ భారమంతా హెచ్ఎంలపై పడడంతో తాము ఏ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నామో అక్కడ న్యాయం చేయలేకపోతున్నామని వాపోతున్నారు. ప్రస్తుతం జిల్లాలో 24 డీఐవోస్ పోస్టులు అలాగే 12 డిప్యూటీ ఈవోలు, గ్రేడ్–1 హెచ్ఎం పోస్టులు 10 ఖాళీగా ఉన్నాయి. 159లో గ్రేడ్ 2 హెచ్ఎం పోస్టుల్లో 32 ఇన్‌చార్జీల కిందనే నడుస్తున్నాయి. పని ఒత్తిడితో చాలామంది హెచ్ఎంలకు పిల్లలకు పాఠాలు చెప్పేందుకు వారానికోసారి సమయం దొరుకుతున్నది. ఇటువంటి పరిస్థితుల్లో విద్యార్థులు నష్టపోతారని నిపుణులు పేర్కొంటున్నారు.





# కౌలు రైతుకేది భరోసా?

- కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కౌలు రైతులకూ రైతుభరోసా అందిస్తామని హామీ
- పవర్‌లోకి వచ్చి మూడు సీజన్లు దాటినా ఇప్పటికీ అందని పంట పెట్టుబడి సాయం
- రంగారెడ్డి జిల్లాలో 90,000కు పైగానే కౌలు రైతులు
- పంటల సాగు కోసం వడ్డీ వ్యాపారుల వద్దకు..
- ఈ వానకాలంలోనైనా అందుతుందని భావించగా ఆశలు ఆవిరి..

రంగారెడ్డి, జూన్ 20 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ హామీల అమల్లో పూర్తిగా విఫలమైంది. తాము అధికారంలోకి రాగానే కౌలు రైతులకు కూడా రైతు భరోసా అందిస్తామని.. ఆశ చూపి.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక పట్టించుకోకుండా మోసం చేస్తున్నది. ఆ పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తి కాగా.. మూడు సీజన్లు కావొస్తున్నా ఇప్పటికీ కౌలు రైతులకు మాత్రం రైతు భరోసా అందడం లేదు. ఈ వానకాలంలోనైనా రైతుభరోసా వస్తుందని ఆశతో ఎదురు చూసిన కౌలు రైతులకు నిరాశే మిగిలింది. ప్రసుత్తం జిల్లాలో 90,000 నుంచి 1,00,000 వరకు కౌలు రైతులున్నారు. వారికి ప్రతి ఏటా అప్పులే తప్పా ఆదాయం లేకపోవడంతో ఆత్మహత్యలే శరణ్యంగా మారింది. వానకాలం పంటల సాగుకు వారు మళ్లీ వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. గత యాసంగిలో కౌలు రైతు లు అప్పులుచేసి పంటలు సాగు చేయగా అతివృష్టి, అనావృష్టితో పంటలు నాశనమై పెట్టిన పెట్టుబడి కూడా రాక అప్పుల ఊబిలో చిక్కుకుపోయారు. ఈ వానకాలం లోనైనా పంటలను సాగుచేసి గత యాసంగి నష్టాన్ని పూడ్చుకుందామనుకుంటే పెట్టుబడి దొరకని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఎన్నికల హామీగా ఇచ్చిన కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాలని కోరుతున్నారు.

### జిల్లాలో 90,000కు పైగానే కౌలు రైతులు..

జిల్లాలో 3,00,000కు పైగా రైతులున్నారు. జిల్లా హైదరాబాద్‌కు సమీపంలో ఉండడంతో భూములు కలిగిన పట్టాదారులంతా నగరంలోనే నివసిస్తూ తమ భూములను కౌలుకు ఇస్తున్నారు. దీంతో గ్రామాల్లో కౌలు రైతుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రసుత్తం జిల్లాలో 90,000 నుంచి 1,00,000 వరకు కౌలు రైతులున్నారు. వీరంతా పట్టాదారుల నుంచి భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం పంటలు పండినా...పండకపోయినా ఎకరాకు రూ.8,000 నుంచి రూ.10,000 వరకు ఇవ్వక తప్పడంలేదు. కౌలు రైతులు పంటల సాగు కోసం వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తీసుకుంటున్నారు. కాగా, గత యాసంగిలో అతివృష్టి, అనావృష్టితో పంటలకు తీవ్రంగా నష్టం కలిగింది. దీంతో కౌలు రైతులకు దిగుబడి రాకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేని పరిస్థితి నెలకొన్నది. వరి, పత్తి, ఇతర పంటలు ఆశాజనకంగా లేకపోవడంతో ఏటా కౌలు రైతులూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

### కౌలు రైతులను ఆదుకోవాలి..



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చాలి. ఎన్నికల ముందు పట్టా రైతులతోపాటు కౌలు రైతులకూ రైతుభరోసా వర్తింజేస్తామని చెప్పి.. అధికారంలోకి వచ్చాక పంపిణీ చేయకపోవడం దారు ణం. కౌలురైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి.. వారికి కూడా రైతు భరోసాను వర్తింపజేయాలి. -పోరెడ్డి అర్జున్‌రెడ్డి

### పత్తి రైతుకూ నష్టమే..

పత్తి రైతులకు కూడా అప్పులే మిగులుతున్నాయి. జిల్లాలో వేలాది ఎకరాల్లో పత్తిని సాగుచేస్తున్నారు. పత్తిని సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర రాకపోవడంతో అప్పులు మీద పడుతున్నాయి. మరోవైపు పండించిన పంట కూలీలు, కౌలుకు పోగా తమకు మాత్రం ఏమీ మిగలడం లేదని వారు కన్నీటి పర్యంతమవుతున్నారు.

### విక్రయించేందుకూ ఇబ్బందే..

కౌలు రైతులు భూములను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా.. పంటను స్వేచ్ఛగా అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే వారికి పట్టా పాసుపుస్తకాలు లేకపోవడం చాలా ఇబ్బందిగా మారింది. పంటను అమ్ముకునేందుకు పట్టా పాస్‌బుక్కులు కలిగిన రైతులను బతిమిలాడాల్సి వస్తున్నది. ఇన్ని విధాలా అవస్థలు పడుతున్న కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. వారికి కూడా రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని అందించాలి.

## ట్రాక్టర్ డీజిల్ కోసం భిక్షాటన

**గట్టు ఇప్పలపల్లిలో జోలే పట్టి నిధులు సేకరించిన బీఆర్ఎస్ నాయకులు**

- చెత్తాచెదారాన్ని తొలగించకపోవడంతో కంపుకొడుతున్న కాలనీలు
- ఊరిలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచన
- బీఆర్ఎస్ హయాంలో పరిశుభ్రంగా ఉన్న పల్లెలు
- అస్తవ్యస్తంగా 18 నెలల కాంగ్రెస్ పాలన

**వచ్చిన మొత్తం రూ. 11,350 గ్రామ కారోబార్ అందజేత**


గట్టుఇప్పలపల్లి గ్రామంలో భిక్షాటన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కడ్తాల్, జూన్ 20 : తలకొండపల్లి మండలంలోని గట్టుఇప్పలపల్లిలో గత కొన్ని రోజులుగా చెత్త సేకరణను గ్రామ పంచాయతీ సిబ్బంది నిలిపేశారు. ఈ విషయమై స్థానిక బీఆర్ఎస్ నాయకులు గ్రామ పంచాయతీ కార్యదర్శిని సంప్రదించగా..గ్రామంలోని చెత్తను సేకరించేందుకు ట్రాక్టర్‌లో డీజిల్ పోయించేందుకు డబ్బులు లేకపోవడంతో ట్రాక్టర్ తాళం చెవిని తలకొండపల్లి ఎంపీడీవోకు అప్పగించినట్లు చెప్పారని వారు తెలిపారు. దీంతో శుక్రవారం గ్రామంలోని కిరాణా షాపులు, గ్రామ పెద్దల వద్ద బీఆర్ఎస్ నాయకులు జోలే పట్టి భిక్షాటన చేసి.. వచ్చిన మొత్తం రూ. 11,350ను గ్రామ కారోబార్ నరేశ్‌కు అందించి.. గ్రామంలోని చెత్తాచెదారాన్ని సేకరించాలని సూచించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో పాలన అస్తవ్యస్తంగా మారిందని మండిపడ్డారు. గ్రామ పాలకులు లేకపోవడంతో గ్రామాలను పట్టించుకునే నాథుడే లేడని.. పారిశుద్ధ్య పనులు జరగకపోవడంతో గ్రామాల్లోని కాలనీలు కంపుకొడుతున్నాయని... ఈగలు, దోమల బెడత ఎక్కువైందన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో ప్రతి గ్రామంలోనూ పారిశుద్ధ్య పనులు ప్రతిరోజూ జరిగేవని.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పరిస్థితి దారుణంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ట్రాక్టర్‌లో డీజిల్ పోయించేందుకు కూడా డబ్బులు లేకపోవడం విడ్డూరంగా ఉన్నదని ఎద్దేవా చేశారు. అధికారులు స్పందించి గ్రామంలోని చెత్తాచెదారాన్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని.. లేకుంటే ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామస్తులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయమ్మావెంకటయ్య, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు జంగయ్య, నాయకులు శరత్‌చంద్ర, కృష్ణయ్య, అశోక్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాజు, విజేందర్, నర్సింహ, జీవ, కొండల్, ఆంజనేయులు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల బస్సులపై ప్రత్యేక నిఘా

**వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి**


స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న పోలీసులు

వికారాబాద్, జూన్ 20 : పాఠశాలల బస్సులు, వ్యాన్‌లపై పోలీసుల ప్రత్యేక నిఘా ఉంటుందని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. విద్యార్థుల రవాణాకు ఉపయోగించే బస్సులు, ఇతర వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆయన జిల్లా పోలీసు అధికారులకు టెలీ కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. పాఠశాలల యాజమాన్యాలు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, విద్యార్థులను తీసుకెళ్లే వాహనాలకు గుర్తింపు పొందిన డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వ్యక్తులనే డ్రైవర్లుగా నియమించాలన్నారు. అదేవిధంగా డ్రైవర్లు డ్రంక్ అండ్ డ్రైవ్ చేయకూడదని హెచ్చరించారు. వాహనాల సీటింగ్ సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించొద్దని.. పాఠశాలల వాహనాలు నిర్ణీత వేగ పరిమితిని మించరాదన్నారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలల యాజమాన్యాలు తమ వాహనాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు అగ్నిమాపక పరికరాలు, ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పైన పేర్కొన్న చర్యలన్నీ విద్యార్థుల సురక్షిత ప్రయాణానికి దోహదపడతాయని, ప్రజలు, తల్లిదండ్రులు కూడా విద్యార్థుల రవాణాపై నిఘా పెట్టాలన్నారు. ఏమైనా నిబంధనల ఉల్లంఘనలు గమనిస్తే వెంటనే సమీపంలోని ఠాణాలో లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

# పొంచి ఉన్న వరద ముంపు!

### కొన్ని చోట్ల నిండుకుండలా చెరువులు

- భారీ వర్షాలు కురిస్తే కాలనీలు, బస్తీలు నీట మునిగే ప్రమాదం
- అధికారుల పర్యవేక్షణ కరువు - 8 నెలలుగా ఎస్ఈ పోస్టు ఖాళీ

*అసలే వర్షాకాలం...చెరువుల సమీపంలో ప్రాంతాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన జీహెచ్ఎంసీ మీనమేషాలు లెక్కిస్తున్నది. వాస్తవంగా వర్షాకాలానికి రెండు నెలలు ముందుగానే పెద్ద చెరువుల్లో వరద నీటిని నిల్వ చేసుకునేలా ప్లాన్ చేయాలి. ఎఫ్‌టీఎల్ (పూర్తి స్థాయి నీటి మట్టం) కంటే తక్కువ నీటి నిల్వ ఉండేలా చూసుకోవాలి. కుండపోత వర్షాలు కురిస్తే చెరువుల అలుగులు మత్తడి పోయకుండా చర్యలు చేపట్టాలి. కానీ ఘనత వహించిన జీహెచ్ఎంసీ చెరువుల్లోని నీటి మట్టాలను కనీసం తనిఖీలు చేయడం లేదు. చాలా వరకు చెరువులు నిండుకుండలా మారాయి.*



- -జీహెచ్ఎంసీ పరిధిలో చెరువులు -185
- -గొలుసు కట్టు చెరువులు -175
- -ఐసోలేటెడ్ లేక్స్ -10
- -చెరువులకు అనుసంధానంగా ఉన్న మేజర్ నాలాలు 29

సిటీబ్యూరో, జూన్ 20 (నమస్తే తెలంగాణ): ముఖ్యంగా సరూర్‌నగర్ పెద్ద చెరువు, కూకట్‌పల్లిలోని ఐడీఎల్ చెరువు, లింగంపల్లిలోని గోపీ చెరువు, ఫాక్స్ సాగర్, నల్లగండ్ల ఇతరత్రా చెరువుల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. ఉన్న ఫలంగా భారీ వర్షాలు కురిస్తే చెరువులు పొంగిపొర్లి పక్కనున్న కాలనీలు, బస్తీలు నీటి మునిగే అవకాశాలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు చెరువుల్లో నీటి మట్టం తనిఖీ చేస్తూ తూములు, అలుగుల ద్వారా నీరు దిగువకు వెళ్లేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడం...మరో వైపు లేక్ విభాగంలో గడిచిన పది నెలలుగా ఎస్ఈ పోస్టు ఖాళీగా ఉండడం చెరువుల పరిరక్షణ, వరద నీటి నివారణపై అధికారుల చిత్తశుద్ధికి అద్దం పడుతున్నది. భారీ వర్షాలు మొదలు కాకముందే అప్రమత్తమై చెరువులపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

### 2020 అక్టోబర్‌లో..

2020 అక్టోబర్‌లో కుండపోత వర్షాలు నగర జనజీవనాన్ని ఉక్కిరిబిక్కిరి చేసిన సంగతి తెలిసిందే.. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ ప్రభుత్వం చెరువుల కట్టల బలోపేతం, తూములు, అలుగుల మరమ్మత్తు, మురుగునీటి మళ్లింపు పనులను రూ. 217.33 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి దశల వారీగా చేపట్టింది. 20 ప్రాంతాల్లో చేపట్టిన పనుల్లో 8 చోట్ల పనులు పూర్తయ్యాయి. రెండో దశ పట్టాలెక్కలేదు..దీనికి తోడు ఎస్ఈ లేకపోవడంతో ముంపు ముప్పు నివారణ, వరద నీటిని నిల్వ చేసుకోవాల్సిన చెరువులన్నీ నిండుకుండను తలపిస్తున్నాయి.

చెరువుల పరిరక్షణే ధ్యేయంగా హైడ్రా విభాగాన్ని ఏర్పాటు చేశామని ఒక వైపు చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో చెరువుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయలేక కబ్జాదారులకు సంబంధిత అధికారులు వంత పాడుతున్నారు. చేతిలో ఉన్న నిధులతో పరిరక్షణ, సుందరీకరణ పనులు చేపట్టి మినీ పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాల్సిన అధికారులు గడిచిన 17 నెలలుగా పనులపై పురోగతి చూపించడం లేదు .

**చెరువుల అభివృద్ధి పనుల వివరాలు**

| జోన్ | పనులు | పూర్తి చేసినవి | ప్రోగ్రెస్‌లో ఉన్నవి | టెండర్ దశలో |
|---|---|---|---|---|
| చార్మినార్ | 2 | 1 | 1 | 0 |
| ఖైరతాబాద్ | 4 | 0 | 4 | 0 |
| కూకట్‌పల్లి | 10 | 2 | 8 | 0 |
| ఎల్బీనగర్ | 5 | 1 | 3 | 1 |
| సికింద్రాబాద్ | 1 | 1 | 0 | 0 |
| శేరిలింగంపల్లి | 12 | 5 | 2 | 3 |

## ఆందోళన దూరం..
# ఆరోగ్య యోగం

**నేడు ప్రపంచ యోగా దినోత్సవం**

మానవుడి మనుగడలో యోగా తప్పనిసరైంది. అనారోగ్య, మానసిక సమస్యలతో సతమతమయ్యే వారికి ఆయువుపోస్తున్నది. యోగా సాధనం ఔషధంలా పనిచేస్తున్నది. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా ప్రతిరోజూ ఒక గంట పాటు యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నది అక్షర సత్యం. అందుకే మన ఆరోగ్య రక్షణకు దిక్సూచి అయిన యోగా ప్రాముఖ్యతను తెలిపేలా.. ప్రతి ఏడాది జూన్ 21న 'ప్రపంచ యోగా దినోత్సవం' నిర్వహిస్తుండడం గమనార్హం.

IVవ పేజీలో..


యోగా డే నేపథ్యంలో ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న నటి మీనాక్షి చౌదరి

### ఆరోగ్యంతో పాటు ఆదాయం కూడా

నేను స్కూళ్లో ఉన్నప్పుడు మా పీఈటీ సార్ ప్రోత్సాహంలో యోగా నేర్చుకున్నా. పెద్దాయ్యాక చాలా మందిలాగే ఐటీ ఉద్యోగం చేయాలనుకున్నా. నిత్యం మానసిక ఒత్తిడికి గురవుతున్న ఐటీ ఉద్యోగుల మానసిక పరిస్థితిని తెలుసుకొని నా నిర్ణయాన్ని మార్చుకున్నా. అందుకే ఎంఎస్సీ యోగా చేశా. ఇప్పటివరకు ఐదుసార్లు ఇంటర్ యూనివర్సిటీ యోగా పోటీల్లో పాల్గొన్నా. తెలంగాణ నుంచి 10 సార్లు నేషనల్ యోగా చాంపియన్‌షిప్‌లో పాల్గొని ప్రతిభ చాటా. మూడేండ్లుగా అమెరికాకు చెందిన 20 మందికి ఆన్‌లైన్‌లో యోగా శిక్షణ ఇస్తున్నా. తెలుగు రాష్ట్రాల్లోని పలువురు సెలబ్రెటీలకు కూడా యోగా నేర్పిస్తున్నా. ప్రస్తుత తన నెల వేతనం రూ. లక్షన్నర. అందరి ఆరోగ్యం కాపాడడంతోపాటు ఆదాయాన్ని కూడా పొందుతున్నా. ప్రస్తుతం సంతోషంగా జీవిస్తున్నా.

– మణికంఠ, యోగా ట్రైనర్